క్లుప్తంగా

ప్రజల దప్పిక తీర్చడం అభినందనీయం



లబ్బీపేట(విజయవాడతూర్పు): వేసవిలో చలివేంద్రాలు ఏర్పాటు చేసి ప్రజల దప్పిక తీర్చడం అభినందనీయమని సెంట్రల్ ఎమ్మెల్యే మల్లాది విష్ణు అన్నారు. సీతారామపురం సన్‌రైజ్ ఆస్పత్రి సమీపంలో 24వ డివిజన్ కార్పొరేటర్ కుక్కల అనిత ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన చలివేంద్రాన్ని శుక్రవారం ఎమ్మెల్యే మల్లాది విష్ణు ప్రారంభించారు. అనంతరం ప్రజలకు మజ్జిగ పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ నిత్యం వైద్య సేవలు, ఇతర పనుల కోసం వేలాది మంది ఇక్కడకు వస్తుంటారని, అలాంటి వారికి చలివేంద్రం ఏర్పాటు చేయడం మంచి పరిణామన్నారు. కార్యక్రమంలో కాజ శంకర్, ఓబిరెడ్డి వెంకట్రామిరెడ్డి, మోహన్‌రావు, క్రాంతి, నాగభూషణం, మోజెస్, కుక్కల రమేష్ తదితరులు పాల్గొన్నారు.

నేడు వాంబే కాలనీలో విద్యుత్ సరఫరాకు అంతరాయం

అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): సింగ్‌నగర్ విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో లైన్ల నిర్వహణ నేపథ్యంలో 60వ డివిజన్‌లోని వాంబేకాలనీలో శనివారం విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు ట్రాన్స్‌కో ఈఈ బీవీ సుధాకర్ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. వాంబేకాలనీ ఏ, బీ, సీ, డీ, ఈ, ఎఫ్, జి బ్లాకులతో పాటు డిస్నీల్యాండ్ రోడ్డు పరిసర ప్రాంతాల్లో ఉదయం 8 నుంచి 10 గంటల వరకూ విద్యుత్ సరఫరా ఉండదని వివరించారు.

నాట్యాచారిణి సరితకు అభినందన



మధురానగర్(విజయవాడసెంట్రల్): కూచిపూడి నృత్య ఉత్సవాల్లో అభినేత్రి పురస్కారం అందుకున్న నాట్యాచారిణి కోట సరితను శుక్రవారం బిస్మిల్లాఖాన్ అవార్డు గ్రహీత చింతా బాలకృష్ణ, స్థానికులు అభినందించారు. అయోధ్యనగర్‌కు చెందిన సరిత.. నృత్యకారిణి మంజు భార్గవి నుంచి పురస్కారం అందుకున్నారు.

పారిశుద్ధ్య కార్మికులకు టోపీలు, ఫ్రూట్‌సలాడ్



అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): సీపీఐ 58వ డివిజన్ శాఖ ఆధ్వర్యాన సింగ్‌నగర్ కృష్ణా హోటల్ సెంటర్‌లో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని శుక్రవారం ఆ పార్టీ నగర కార్యదర్శి జి.కోటేశ్వరరావు ప్రారంభించారు. సీపీఐ కార్యదర్శివర్గ సభ్యులు కేవీ భాస్కరరావు ఆర్థిక సాయంతో పారిశుద్ధ్య కార్మికులకు టోపీలు, విసనకర్రలు అందజేశారు. పాదచారులు, ప్రయాణికులకు మజ్జిగ, ఫ్రూట్‌సలాడ్‌ను పంపిణీ చేశారు. నేతలు లంకా గోవిందరాజులు, బెవర శ్రీనివాసరావు, ప్రజానాట్యమండలి కళాకారుడు, గాయకుడు షేక్ నజీర్ తదితరులు పాల్గొన్నారు.

జగన్‌పై ప్రజలకు అపార నమ్మకం

ఎమ్మెల్యే మల్లాది విష్ణు



స్థానిక సమస్యలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే విష్ణు, కార్పొరేటర్ షాహీనాసుల్తానా

అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన అంటే రాష్ట్ర ప్రజలకు అపారమైన నమ్మకమని ప్లానింగ్ బోర్డు వైస్ చైర్మన్, ఎమ్మెల్యే మల్లాది విష్ణు అన్నారు. 59వ డివిజన్ 253వ వార్డు సచివాలయం పరిధిలో శుక్రవారం గడప గడపకు మన ప్రభుత్వం జరిగింది. స్థానిక కార్పొరేటర్ ఎండీ షాహీనా సుల్తానాతో కలిసి ఆయన 320 గడపలను సందర్శించారు. స్థానిక సమస్యలను ప్రత్యక్షంగా వీక్షించి వాటి పరిష్కారానికి సంబంధిత అధికారులతో మాట్లాడి చర్యలు తీసుకున్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంతకం చేసిన బుక్‌లెట్లను ప్రజలకు అందించి, ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను వివరించారు.

విధి నిర్వహణలో నిర్లక్ష్యం వద్దు

ప్రజలకు మెరుగైన పాలన అందించడానికి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పరితపిస్తున్నారని, అధికారులు, సిబ్బంది నిర్లక్ష్యం వహించొద్దని ఎమ్మెల్యే విష్ణు తెలిపారు. డివిజన్‌లో పారిశుద్ధ్యం, యూజీడీ సమస్యలపై ప్రజలు ఎక్కువగా ఫిర్యాదులు చేయడంపై సంబంధిత అధికారులను పిలిచి హెచ్చరించారు.

సీఎం జగన్ పాలన దేశానికే ఆదర్శం

అనంతరం జరిగిన మీడియా సమావేశంలో ఎమ్మెల్యే విష్ణు మాట్లాడుతూ ఆరోగ్యశ్రీ, ఫీజురీయింబర్స్‌మెంట్ వంటి పథకాలను ఇతర రాష్ట్రాలు ఆదర్శంగా తీసుకుంటున్నాయని, దేశానికే ఆదర్శంగా మన సీఎం జగనన్న పాలన ఉండటం సంతోషంగా ఉందన్నారు. వలంటీర్లు గోను సంచులు మోసే ఉద్యోగమని చంద్రబాబు కించపరిస్తే ఆయన తనయుడు లోకేష్ వలంటీర్ల సేవలను కొనసాగిస్తామని చెప్పడం వైఎస్సార్ సీపీ ప్రభుత్వ విజయంగా భావిస్తున్నామని చెప్పారు. కో ఆప్షన్ సభ్యులు నందెపు జగదీష్, కార్పొరేషన్ ఈఈ శ్రీనివాస్, డీఈలు గురునాథం, రామకృష్ణ, ఏఎంఓహెచ్ రామకోటేశ్వరరావు, సీడీఓ జగదీశ్వరీ, వైఎస్సార్ సీపీ నాయకులు నందెపు సురేష్, ఎండీ హఫీజుల్లా, దేవిరెడ్డి రమేష్‌రెడ్డి, కంభగళ్ల రాజు, ఆదిరాల విజయ్‌కుమార్, నేరెళ్ల శివప్రసాద్, చింతా చిన్నా, చింతా శ్రీను, షేక్ అమిత్, షేక్ నాగుల్‌మీరా తదితరులు పాల్గొన్నారు.

నగరంలోని 20 కూడళ్లలో చలివేంద్రాలు

ఏపీ ఫైబర్‌నెట్ చైర్మన్ గౌతంరెడ్డి



మజ్జిగ పంపిణీలో గౌతంరెడ్డి

మధురానగర్(విజయవాడసెంట్రల్): ముత్యాలంపాడు శ్రీ షిర్డీ సాయిబాబా మందిరం సేవలను మరింత విస్తృతం చేస్తున్నామని అందులో భాగంగా నగరంలోని 20 కూడళ్లలో చలివేంద్రాలు ఏర్పాటు చేయనున్నట్లు మందిర గౌరవాధ్యక్షులు, ఏపీ ఫైబర్‌నెట్ చైర్మన్ డాక్టర్ పూనూరు గౌతంరెడ్డి అన్నారు. 30వ డివిజన్ దేవీనగర్ ఆచంట వెంకటరత్నంనాయుడు సర్కిల్, రామకృష్ణాపురం బుడమేరు వంతెన సెంటర్‌లో శుక్రవారం బాబా మందిరం ఆలయ కమిటీ ఆధ్వర్యాన రోటరీ క్లబ్ ఆఫ్ విజయవాడ సహకారంతో చలివేంద్రాలు ప్రారంభోత్సవ కార్యక్రమం జరిగింది. స్థానిక కార్పొరేటర్ జానారెడ్డితో కలిసి చలివేంద్రాలను ప్రారంభించారు. అనంతరం పాదచారులకు మజ్జిగ పంపిణీ చేశారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ యాదల శ్రీనివాసరావు, ఆలయ కమిటీ సభ్యులు, వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.

● 31వ డివిజన్ ముత్యాలంపాడులో శుక్రవారం పెనుమత్స సత్యం ఫ్రెండ్స్ సర్కిల్ ఆధ్వర్యాన జొన్నలగడ్డ పద్మావతి సహకారంతో పాదచారులకు మజ్జిగ పంపిణీ చేశారు. వైఎస్సార్ సీపీ డివిజన్ అధ్యక్షుడు సత్యం, నేతలు పాల్గొన్నారు.

కండ్రికలో డీఎం అండ్ హెచ్ఓ పర్యటన



బాలింతలకు అందిస్తున్న సేవలను తెలుసుకుంటున్న డీఎం అండ్ హెచ్ఓ సుహాసిని

అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): ఎన్టీఆర్ జిల్లా డిస్ట్రిక్ట్ మెడికల్, హెల్త్ ఆఫీసర్(డీఎంఅండ్‌హెచ్ఓ) ఎం.సుహాసిని 64వ డివిజన్‌లోని కండ్రిక, నేతాజీ సుభాష్‌చంద్రబోస్ కాలనీ పరిసర ప్రాంతాల్లో శుక్రవారం ఆకస్మికంగా పర్యటించారు. తొలుత కండ్రికలోని ముఖ్యమంత్రి ఆరోగ్య కేంద్రాన్ని తనిఖీ చేసిన ఆమె అక్కడ ఉన్న రోగులతో మాట్లాడి వారికి అందిస్తున్న వైద్య సేవలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం హాస్పటల్ వైద్య బృందంతో మాట్లాడి ఎలాంటి సదుపాయాలు అందుబాటులో ఉన్నాయి, సమస్యలు ఏమైనా ఉన్నాయా అని తెలుసుకున్నారు.

అక్కడి నుంచి ఎన్ఎస్‌సీ బోస్ నగర్‌లో పర్యటించి స్థానిక సమస్యలను తెలుసుకున్నారు. చిన్నారులకు ఇస్తున్న ఆహారం, వారి గ్రోత్ చాట్‌లను పరిశీలించారు. డ్రెయిన్లలో మురుగు పారుదల, లార్వాను స్వయంగా పరిశీలించి సంబంధిత అధికారులతో మాట్లాడి సమస్యాత్మక ప్రాంతాల్లో దోమల నివారణకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. నీటిని నిల్వలు చేయొద్దని తెలిపారు. ఇళ్ల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని చెప్పారు. కండ్రిక ముఖ్యమంత్రి ఆరోగ్య కేంద్రం వైద్యులు, ఏఎన్ఎంలు, మలేరియా, శానిటరీ విభాగ అధికారులు పాల్గొన్నారు.

సాంస్కృతిక, కళారంగాల అభివృద్ధికి కృషి



పాటిబండ్ల జానకిని సత్కరిస్తున్న మల్లాది విష్ణు, అన్నవరపు రామస్వామి, గోవిందరాజన్

విజయవాడ కల్చరల్: సాంస్కృతిక, కళారంగాల అభివృద్ధికి ప్రభుత్వం చిత్తశుద్ధితో కృషి చేస్తోందని సెంట్రల్ ఎమ్మెల్యే మల్లాది విష్ణు అన్నారు. దుర్గాపురంలోని ఘంటసాల వెంకటేశ్వరరావు ప్రభుత్వ సంగీత కళాశాలలో శుక్రవారం వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విష్ణు మాట్లాడుతూ ఈ కాలేజీలో సంగీతం నేర్చుకున్నవారు నేడు సంగీత రంగంలో ఉన్నత స్థానంలో ఉన్నారని తెలిపారు. సంగీత కళాశాల ప్రిన్సిపాల్ కేఎస్ గోవిందరాజన్ మాట్లాడుతూ 63 సంవత్సరాల క్రితం నగరంలో సంగీత కళాశాలను ప్రారంభించారని తెలిపారు. వేలాదిమంది ఇక్కడ సంగీతంతోపాటు నాట్యంలో శిక్షణ తీసుకొని జీవితంలో స్థిరపడ్డారని గుర్తుచేశారు. సంగీత విద్వాంసురాలు పాటిబండ్ల జానకిని సెంట్రల్ ఎమ్మెల్యే ఆత్మీయంగా సత్కరించారు. కార్యక్రమంలో కార్పొరేటర్ కొండాయిగుంట మల్లీశ్వరి, వయోలిన్ విద్వాంసులు అన్నవరపు రామస్వామి, మాజీ మేయర్ జంధ్యాల శంకర్, సంగీత కళాశాల పూర్వ అధ్యాపకులు పాల్గొన్నారు. కళాశాలలో ప్రతిభ చూపిన విద్యార్థులకు నిర్వాహకులు ప్రశంసా పత్రాలను నగదు బహుమతులు అందజేశారు.

ఆకట్టుకున్న సాంస్కృతిక ప్రదర్శనలు

కూచిపూడి నాట్యాచార్యులు సీహెచ్ అజయ్‌కుమార్, భాగవతుల సౌమ్య బృందం కూచిపూడి అంశాలను ప్రదర్శించారు. వీణ అధ్యాపకులు గోవిందరాజన్ బృందం, వయోలిన్ అధ్యాపకురాలు విష్ణుభొట్ల కృష్ణ వేణి బృందం వయోలిన్‌పై కీర్తనలు పలికించారు. గాత్ర విభాగం అధ్యాపకులు, లక్ష్మీ నరసమ్మ, మల్లాది కార్తిక త్రివేణి, శోభా లక్ష్మి, చంద్రపన్ బృందం సంప్రదాయ కీర్తనలు పలికించారు. వాద్య అధ్యాపకులు ఫల్గుణ్ స్టీవెన్ రాజు, అనిల్‌కుమార్ బృందాలు మృదంగం, తబలాపై కీర్తనలను పలికించి ఆకట్టుకున్నారు.

రేపు చిత్రలేఖనం పోటీలు

మధురానగర్(విజయవాడసెంట్రల్): చిన్నారుల్లో ప్రతిభను వెలికితీయడానికి ఈ నెల 30వ తేదీన సూర్యారావుపేటలోని తమశాఖలో నగర స్థాయిలో చిత్రలేఖనం పోటీలు నిర్వహిస్తామని గ్రోయింగ్ మైండ్స్ ప్లే స్కూల్ డైరెక్టర్ నాగ ప్రసన్న తెలిపారు. మారుతీనగర్‌లోని గ్రోయింగ్ మైండ్స్ ప్లే స్కూల్లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ సబ్ జూనియర్ (1, 2, 3 తరగతులు), జూనియర్ (4, 5, 6 తరగతులు), సీనియర్స్ (7, 8, 9 తరగతులు) విభాగాల వారీగా విద్యార్థులకు పోటీలు నిర్వహిస్తామన్నారు. సబ్ జూనియర్స్ 'నా కుటుంబం/ఫ్రూట్ బాస్కెట్' అంశంపై, జూనియర్స్‌కు 'పుట్టినరోజు వేడుకలు' అంశంపై, సీనియర్స్‌కు 'ఫేవరేట్ హాలిడే స్పాట్' అంశంపై చిత్రాలు వేయాల్సి ఉంటుందన్నారు. ఆసక్తి ఉన్న విద్యార్థులు ఈ నెల 29వ తేదీ రాత్రి 7 గంటల్లోపు ఫోన్ 90142 23399 నంబరులో పేర్లు నమోదు చేసుకోవాలన్నారు.

దాసాంజనేయస్వామి ఆలయంలో సంప్రోక్షణ



మధురానగర్(విజయవాడసెంట్రల్): మాచవరం దాసాంజనేయస్వామి దేవాలయంలో శుక్రవారం సంప్రోక్షణ పూజను ఆలయ అర్చకులు ఘనంగా నిర్వహించారు. ఆలయంలోని ధ్వజస్తంభం మేఘలాలు, పాలవెల్లి గాలి వాటుకు కింద పడటంతో సంప్రోక్షణ పూజ ఏర్పాటు చేశారు. ఆలయ చైర్మన్ కనపర్తి కొండలరావు, ధర్మకర్తలు నాగేశ్వరరెడ్డి, బండి నాగజ్యోతి తదితరులు పూజలు చేశారు. కార్యక్రమాలను ఆలయ కార్యనిర్వహణాధికారి నాగినేని భవాని పర్యవేక్షించారు.

మధురంగా త్యాగరాజ కీర్తనలు



విజయవాడ కల్చరల్: త్యాగరాజస్వామి జయంతి సందర్భంగా శ్రీ సద్గురు సంగీత సభ ఆధ్వర్యాన దుర్గాపురంలోని శివరామకృష్ణ క్షేత్రంలో జరుగుతున్న కర్ణాటక సంగీత కార్యక్రమాలు భక్తిగా సాగుతున్నాయి. శుక్రవారం జరిగిన సంగీత ఉత్సవంలో వివిధ ప్రాంతాలనుంచి వచ్చిన విద్వాంసులు, యువ సంగీత కళాకారులు త్యాగరాజ కీర్తనలను మధురంగా గానం చేశారు. వంజరి కృష్ణ, పద్మావతి, శ్రీనిధి, సింధు తదితరులు గానం చేశారు. వీణపై చిట్టా కార్తీక్ త్యాగరాజ కృతులు పలికించారు.

● ఈ నెల 30వ తేదీ ఆదివారం త్యాగరాజ స్వామి కృతుల గోష్ఠిగానం నిర్వహిస్తునట్లు శ్రీ సద్గురు సంగీత సభ ప్రధాన కార్యదర్శి గౌరీనాథ్ తెలిపారు.

నేడు స్థాయీ సంఘం సమావేశం

పటమట(విజయవాడతూర్పు): నగరపాలక సంస్థ పరిధిలోని 64 డివిజన్ల అభివృద్ధికి పలు నిర్ణయాలు తీసుకోవడానికి మేయర్ రాయన భాగ్యలక్ష్మి ఆధ్వర్యంలో శనివారం స్థాయీ సంఘం సమావేశం జరగనుంది. వీఎంసీ ప్రధాన కార్యాలయంలోని కమాండ్ కంట్రోల్ రూంలో సాయంత్రం 4 గంటలకు సమావేశం నిర్వహించనున్నారు. అజెండాలో మొత్తం 15 అంశాలు రాగా సభ్యులు ఆయా అంశాలను చర్చించి నిర్ణయం తీసుకోనున్నారు.

ప్రధానాంశాలివి

● 63వ డివిజన్‌లోని వడ్డెర కాలనీలో వీఎంసీ మల్టీ పర్పస్ హాల్, వాంబే కాలనీ హెచ్‌బ్లాక్‌లోని కమ్యూనిటీ హాలు లీజు, శ్రీకృష్ణదేవరాయ షాపింగ్ కాంప్లెక్స్‌లో 14 షాపుల లీజు పొడిగింపు, అద్దె పెంపుదలపై వచ్చిన ప్రతిపాదనను సభ్యులు చర్చించి నిర్ణయం తీసుకోనున్నారు.

● సర్కిల్–1 పరిధిలోని 48వ డివిజన్ బ్రహ్మంగారి మఠం వద్ద కల్యాణ మండపానికి షెడ్ నిర్మాణం, తమ్మిన పోతురాజు కమ్యూనిటీ హాలు మొదటి అంతస్తు నిర్మాణానికి కార్పొరేషన్ జనరల్ బడ్జెట్ నుంచి నిధులు ఖర్చు చేయాలని వచ్చిన ప్రతిపాదనపై సభ్యులు చర్చించనున్నారు.

● వీఎంసీ నూతన భవనం 2వ అంతస్తు వరకు ఎయిర్‌కండిషన్లు, ఇతర వస్తువుల మంజూరుకు, రూ.49.80 లక్షల నిధుల మంజూరుకు వచ్చిన ప్రతిపాదనపై సభ్యులు నిర్ణయం తీసుకోనున్నారు.

● పశ్చిమ నియోజకవర్గ పరిధిలోని రైల్వేట్రాకు నుంచి పాత ఆర్‌ఆర్‌పేట స్ట్రాం వాటర్ డ్రెయిన్ నిర్మాణం వరకు ఆర్‌సీసీ బాక్స్ కల్వర్టు నిర్మాణం చేపట్టడానికి అయ్యే రూ.49.50 లక్షలు కార్పొరేషన్ జనరల్ బడ్జెట్ నుంచి నిధులు మంజూరు చేసి ఖర్చు చేయాలని వచ్చిన ప్రతిపాదనపై సభ్యులు చర్చించనున్నారు.

1 నుంచి వేసవి శిక్షణ

మధురానగర్(విజయవాడసెంట్రల్): త్రిదండి శ్రీమన్నారాయణ రామానుజ చిన్న జీయర్‌స్వామి ఆశీస్సులతో వికాసతరంగిణి ఆధ్వర్యాన వచ్చే నెల 1 నుంచి 15వ తేదీ వరకు సమ్మర్ క్యాంప్ నిర్వహించనున్నట్లు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ముత్యాలంపాడు జెండా చెట్టు వీధిలోని అజయ్ హైస్కూల్, 5వ నెంబర్ రూట్‌లోని రిలైఫ్ మెడికల్ రిహాబ్ సెంటర్ గోపురం బిల్డింగ్‌లో సమ్మర్ క్యాంప్ శిక్షణ జరుగుతుందని పేర్కొన్నారు. సంస్కృతి సంప్రదాయాలను ప్రతిబింబించేలా శిక్షణ కార్యక్రమం జరుగుతుందని, ఆసక్తి ఉన్నవారు 9908922721లో సంప్రదించాల్సిందిగా కోరారు.

రాష్ట్ర స్థాయి చెస్ ఫిడేరేటింగ్ పోటీల రన్నర్ శర్వాణి

విజయవాడ స్పోర్ట్స్: రాష్ట్ర స్థాయి అండర్–17 బాలికల చెస్ ఫిడేరేటింగ్ పోటీల్లో నగర క్రీడాకారిణి చీదెళ్ల శర్వాణి రెండో స్థానంలో నిలిచి రన్నర్ ట్రోఫీని కైవసం చేసుకోవడం అభినందనీయమని ది విజయవాడ చెస్ అసోసియేషన్ అధ్యక్ష కార్యదర్శులు ఎండీ అక్బర్‌పాషా, ఎం.రాజీవ్ తెలిపారు. కృష్ణా జిల్లా పోరంకిలో ఇటీవల జరిగిన పోటీల్లో సత్తా చాటిన శర్వాణిని శుక్రవారం అభినందించారు. ఎన్టీఆర్ జిల్లా సెకండ్ సీడెడ్ చెస్ క్రీడాకారిణి రాష్ట్ర స్థాయి పోటీలకు శర్వాణి ప్రాతినిధ్యం వహించినట్లు చెప్పారు. రాష్ట్ర స్థాయి పోటీల్లో 7/8 పాయింట్లు సాధించడంతో పాటు రూ. 3,500 నగదు ప్రోత్సాహక బహుమతి, ప్రశంసాపత్రాన్ని సాధించిందన్నారు. మే ఒకటో తేదీ నుంచి పంజాబ్‌లో జరిగే జాతీయ పోటీలకు శర్వాణి అర్హత సాధించిందన్నారు.

అప్పుల బాధ తాళలేక మహిళ ఆత్మహత్య

అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): అప్పుల బాధ తాళలేక ఓ మహిళ ఆత్మహత్య చేసుకున్న ఘటన అయోధ్యనగర్‌లో శుక్రవారం చోటుచేసుకుంది. అజిత్‌సింగ్‌నగర్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం అయోధ్యనగర్‌కు చెందిన రాజనాల జ్యోతి(41)కి కుమార్తె, కుమారుడు ఉన్నారు. భర్త రవికుమార్ 13 ఏళ్ల క్రితం అనారోగ్యంతో మరణించగా జ్యోతి అప్పటి నుంచి ఇంటి ముందు చిల్లరకొట్టు నడుపుతూ ఇద్దరు బిడ్డలను పోషించుకుంటోంది. అప్పులు ఎక్కువ కావడంతో ఆమె తరచూ బాధపడుతూ ఉండేది. శుక్రవారం ఉదయం షాపులో పెట్టిన కిరాణా డబ్బులు తగ్గడంతో తన కూతురు చరితశ్రీని పిలిచి డబ్బులు ఏమైనా తీశావా అని అడగ్గా ఆమె నేనేమి తీయలేదంటూ కాస్త గట్టిగా సమాధానం చెప్పింది. దీంతో ఒక్కసారిగా అసహనానికి గురైన ఆమె ఇంట్లోకి వెళ్లి తలుపులు వేసుకొని ఫ్యానుకు ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడింది. సమాచారం అందుకున్న పోలీసులు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బాలుడి ఆచూకీ లభ్యం

సత్యనారాయణపురం(విజయవాడసెంట్రల్): బాలుడి అదృశ్యం కేసులో సత్యనారాయణపురం పోలీసులు గంటల వ్యవధిలోనే ఆచూకీ కనుగొని సురక్షితంగా తల్లిదండ్రులకు అప్పగించారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం బావాజీపేటలో నివసిస్తున్న దంపతులకు కుమార్తె, కుమారుడు ఉన్నారు. కుమారుడు(17) నగరంలోని ఒక ప్రైవేటు కళాశాలలో ఇంటర్ మొదటి సంవత్సరం పరీక్షలు రాశాడు. ఈ నెల 26న వచ్చిన ఫలితాల్లో ఫెయిల్ అయ్యాడు. 27 ఉదయం 10 గంటలకు కుమార్తె, కుమారుడు వారు చదివే కళాశాలకు వెళ్లి సప్లమెంటరీ పరీక్ష ఫీజు కట్టి ఇంటికి వచ్చారు. అనంతరం కుమారుడు బయటకెళ్లి సాయంత్రమైనా తిరిగి రాలేదు. దీంతో తల్లిదండ్రులు చుట్టుపక్కల బంధువుల వద్ద వాకబు చేసినా ఆచూకి లభించకపోవడంతో ఎస్ఎన్‌పురం పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీనిపై కేసు నమోదు చేసిన వారు సాంకేతిక పరిజ్ఞానం ఉపయోగించి బాలుడు రైలులో హైదరాబాద్ వెళ్తున్నట్లు గుర్తించారు. దీంతో హైదరాబాద్‌లో ఉండే వారి బంధువులకు విషయం తెలిపి బాలుడిని సంరక్షించారు. కుటుంబ సభ్యులతో కలసి హైదరాబాద్ చేరుకున్న పోలీసులు బాలుడిని తల్లిదండ్రులకు అప్పగించారు.

దివ్యాంగులపై వివక్ష చూపితే చర్యలు

కలెక్టర్ ఢిల్లీరావు



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ ఢిల్లీరావు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): దివ్యాంగులపై వివక్ష చూపితే కఠిన చర్యలు తప్పవని కలెక్టర్ ఢిల్లీరావు హెచ్చరించారు. కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో శుక్రవారం విభిన్న ప్రతిభావంతుల సంక్షేమానికి ఏర్పాటు చేసిన జిల్లా స్థాయి సమన్వయ కమిటీ తొలి సమావేశం జరిగింది. కలెక్టర్ మాట్లాడుతూ చట్టం ద్వారా దివ్యాంగులకు కల్పించిన హక్కులను అమలు చేయడంతోపాటు, వారి సంక్షేమానికి సమన్వయ కమిటీ కృషి చేయాల్సిన అవసరం ఉందన్నారు. ప్రధానంగా విభిన్న ప్రతిభావంతుల ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. చట్టంలోని సెక్షన్ 25ను పారదర్శకంగా అమలు చేయడానికి ప్రత్యేక అధికారిని నియమిస్తామన్నారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో రెండు ప్రత్యేక పడకలను వారికి కేటాయించాలన్న నిబంధనలు అమలుచేయడానికి వైద్య అధికారులను ఆదేశిస్తామన్నారు. దివ్యాంగులు విద్యను అభ్యసించేలా ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల్లో నోడల్ అధికారిని నియమించి వారు కోరుకున్న పాఠశాలలో ప్రవేశం కల్పించేలా చర్యలు తీసుకోవాలన్నారు. దివ్యాంగులతో కళాత్మిక ప్రతిభ సాంస్కృతిక వికాసాన్ని పెంచడానికి అకాడమీ ద్వారా శిక్షణ అందించాల్సిన అవసరం ఉందన్నారు. స్పోర్ట్స్ అథారిటీ ఆధ్వర్యంలో విభిన్న ప్రతిభావంతులకు ప్రత్యేక కోచ్‌లను నియమించి వారిని ఉత్తమ క్రీడాకారులుగా తీర్చి దిద్దేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. సదరం రిజిస్ట్రేషన్ ప్రకియలో మార్పులు చేసేలా కమిటీ కృషి చేస్తుందన్నారు. సమావేశంలో విభిన్న ప్రతిభావంతుల సంక్షేమ శాఖ ఏడీ రామ్ కుమార్, ఎల్‌డీఎం కోటేశ్వరావు, చేయూత స్వచ్ఛంద సంస్థ ప్రతినిధి కృష్ణ కుమారి, ఏసీపీ కె. వెంకటేశ్వరరావు, మెప్మా పీడీ ఎస్ ఎస్ విశాలాక్షి, డీఆర్‌డీఏ డీపీఎం జె. శోభన్ బాబు, విభిన్న ప్రతిభావంతుల ప్రభుత్వ ఉద్యోగ సంఘం నాయకులు రవీంద్ర బాబు, వికలాంగుల సంక్షేమ సంఘం అధ్యక్షులు స్వామి, కమిటీ సభ్యులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

ఇళ్ల నిర్మాణాల్లో వేగం పెంచండి



అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే విష్ణు

అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): నియోజకవర్గంలో నిరుపేదలకు ఇచ్చిన జగనన్న కాలనీల్లో ఇళ్ల నిర్మాణాలను వేగవంతం చేయాలని రాష్ట్ర ప్లానింగ్ బోర్డు వైస్ చైర్మన్, ఎమ్మెల్యే మల్లాది విష్ణు అధికారులను ఆదేశించారు. సింగ్‌నగర్ ఆంధ్రప్రభ కాలనీలోని తన కార్యాలయంలో పలు శాఖల అధికారులతో శుక్రవారం ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. ముందుగా టిడ్కో ఇళ్ల నిర్మాణాలపై చర్చించారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన హామీతో లబ్ధిదారులకు రూపాయికే రిజిస్ట్రేషన్ చేసి ఇవ్వాలని, పంపిణీ తేదీ ఖరారు చేసి దానికి అనుగుణంగా ఇళ్ల నిర్మాణాలను త్వరితగతిన పూర్తిచేయాలని ఆదేశించారు. పేదల ఇళ్ల నిర్మాణాలకు ప్రభుత్వం రూ.179.62 కోట్లు వెచ్చించి 428.62 ఎకరాల్లో నియోజకవర్గంలోని 22,754 మందికి ఇళ్ల పట్టాలను మంజూరు చేసిందని వివరించారు. ఒక్కో ఇంటికి రూ.1.80 లక్షల చొప్పున మొత్తంగా రూ.589.19 కోట్లు పేదల గృహాలకు కేటాయించిందని తెలిపారు. జగనన్న కాలనీల్లో మౌలిక వసతులు కల్పించడంపై శ్రద్ధ వహించాలని సూచించారు. కార్పొరేషన్ పీఓ యూసీడీ శకుంతల, టౌన్‌ప్లానింగ్ ఏసీపీ బాలాజీ, హౌసింగ్ డీఈ రవికాంత్, నార్త్‌జోన్ తహసీల్దార్ చందన దుర్గాప్రసాద్, టిడ్కో ఏఈ సతీష్, సీడీఓ జగదీశ్వరి తదితరులు పాల్గొన్నారు.

విస్తృతంగా దోమల నివారణకు చర్యలు



బుడమేరులో గుర్రపుడెక్కను తొలగిస్తున్న దృశ్యం

మధురానగర్(విజయవాడసెంట్రల్): స్థానిక 30వ డివిజన్‌లో దోమల నివారణ చర్యలు వేగవంతం చేశారు. దోమల ఆవాసకేంద్రంగా మారిన బుడమేరులో గుర్రపుడెక్కను జేసీబీ సాయంతో తొలగిస్తున్నారు. డ్రోన్ల ద్వారా బుడమేరులో దోమల నివారణ మందును చల్లిస్తున్నారు. మాస్ క్యాంపెయిన్ ద్వారా ఫాగింగ్ చేస్తున్నారు. మురుగు కాల్వల్లో ఫాగింగ్ చేయడంతో పాటు ఖాళీ స్థలాలను మెరక చేయించాలని వీఎంసీ అధికారులు స్థల యజమానులకు సూచిస్తున్నారు. దోమల నివారణకు వారంలో ఒక రోజు డ్రైడేగా పాటించాలని అవగాహన కల్పించి ఖాళీ స్థలాల్లో ఆయిల్ బాల్స్ వేస్తున్నారు.

ద్విచక్ర వాహనం ఢీకొని వృద్ధుడికి గాయాలు

కృష్ణలంక(విజయవాడతూర్పు): ద్విచక్ర వాహనం ఢీకొనడంతో వృద్ధుడు తీవ్రంగా గాయపడ్డాడు. ఘటన కృష్ణలంక పీఎస్ పరిధిలోని బెంజిసర్కిల్ సమీపంలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు రామచంద్రనగర్‌లోని ఆచార్య రంగా వీధిలో నివసిస్తున్న రాజపుత్ర రూప్‌సింగ్(80) శుక్రవారం ఉదయం బెంజిసర్కిల్‌లోని పెట్రోల్ బంకు వైపు నుంచి ట్రెండ్‌సెట్ మాల్ వైపు రోడ్డు దాడుతున్నాడు. ఆ సమయంలో బెంజిసర్కిల్ వైపు నుంచి పశువుల ఆసుపత్రి వైపు వెళ్తున్న ద్విచక్ర వాహనం వృద్ధుడిని ఢీకొట్టింది. అతను కిందపడిపోవడంతో తలకు, ఎడమ కాలికి బలమైన గాయాలై తీవ్ర రక్తస్రావమైంది. ప్రయాణికులు 108 ద్వారా ప్రభుత్వాస్పత్రికి తరలించారు. సమాచారం అందుకున్న కృష్ణలంక ఎస్ఐ ప్రకాశరావు ఘటన స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. బాధితుడి ఫిర్యాదుపై కేసు నమోదు చేశారు.

ఎన్టీఆర్‌కు స్వరాంజలి

విజయవాడ కల్చరల్: సినీనటుడు ఎన్టీఆర్ శత జయంతి వేడుకల సందర్భంగా చంద్రశేఖర్ కల్చరల్ అకాడమీ ఆధ్వర్యాన శుక్రవారం గాంధీనగర్‌లోని కొత్తా పూర్ణానందం కళావేదికపై నిర్వహించిన సినీ సంగీత విభావరి మధురంగా సాగింది. రైల్వే విశ్రాంతఉద్యోగి దండు చంద్రశేఖర్ ఆధ్వర్యంలో ఎన్టీఆర్ నటించిన చిత్రాలతోపాటు ఇతర చిత్రగీతాల పాటలు ఆలపించారు.